వసుంధర

# నిత్యశంకితుడు

మా పక్కింటి సీత అన్నా, క్లాస్‌మేట్ శంకర్రావు అన్నా నాకు విపరీతమైన జాలిగా ఉండేది.

సీత నాకంటే నాలుగైదేళ్ల చిన్న మనిషి నల్లగా వుంటుంది ఎత్తుపళ్ళు మనిషిలో ఏవిధమైన ఆకర్షణాలేదు- మంచితనం తప్ప!

సీతను హైస్కూల్లో అంతా ఏడిపించేవారు. తోటి ఆడపిల్లలే చిన్నచూపు చూసేవారు నాకు మాత్రం సీతంటే జాలిగా ఉండేది. వీలున్నపుడల్లా కథలు చెప్పేవాణ్ణి మాయింట్లో క్యారమ్సు ఆడనిచ్చేవాణ్ణి వాళ్ళింటికివెళ్ళి గుళ్ళబోర్డు ఆడేవాణ్ణి ఈ కారణంగా సీత నన్ను చాలా అభిమానించేది

శంకర్రావు మాస్కూలు హెడ్మాస్టరుగారబ్బాయి. అతడు తెల్లగా, నన్నగా, అందంగా ఉంటాడు. క్లాసులో మంచి మార్కులు తెచ్చుకుంటాడు. వార్తాపత్రికలు చదివి, రేడియోలో విని ప్రపంచంలోని ఎక్కడెక్కడి విశేషాలూ తెలుసుకుంటాడు.

నిజానికి అతడిని చూసి జాలిపడదగ్గ అవసరమేమీలేదు- అతడిలో అనుమాన గుణం లేకపోతే.

క్లాసులో అతడికి మంచి మార్కులు వస్తాయి అందుకు కారణం తనతండ్రి హెడ్మాస్టరు కావడమేనని అనుమానిస్తాడు ఏ సబ్జక్టులోనైనా మంచిమార్కులు రాకపోతే అందుకు కారణం ఆ టీచరుకు తనతండ్రి అంటే ఉన్నకోపం అనుకుంటాడు ఎవరైనా పొగిడితే తనతో అవసరముందను కుంటాడు తిడితే తన్నుచూసి అసూయ పడుతున్నారనుకొంటాడు.

శంకర్రావుకు పదిసంవత్సరాల వయసు వచ్చేక అతడికో చెల్లాయి పుట్టింది ఆరోజునుంచీ తలిదండ్రులకు తనమీద ప్రేమ తగ్గిపోయిందని అతడనుమానించాడు ఆవిషయం తలిదండ్రులు త్వరగానే గ్రహించి అతడికలాంటి తలపు కలగకుండా ప్రవర్తించ సాగారు. అప్పుడు శంకర్రావు- నేను ఉద్యోగంలోచేరాక నాపెళ్ళికి వచ్చే కట్నం చెల్లాయి పెళ్ళికి ఉపయోగించాలికదా అందుకే అమ్మా, నాన్నా నామీద ప్రేమ నటిస్తున్నారు- అనుకునేవాడు.

శంకర్రావు తన మనోభావాలు ఒక్కటొక్కటిగా నాకు చెబుతూండేవాడు అప్పట్లో నాకు మనస్తత్వాల గురించిన అవగాహనలేదు అందువల్ల అతడుచెప్పినవన్నీ నిజమనే అనుకుని జాలిపడేవాణ్ణి ఆ తర్వాత పెద్దచదువులకు వెడుతూ మేము విడిపోయాక అడపాతడపా ఉత్తరాలు వ్రాసుకుంటూండేవాళ్ళం. నాబుద్ధి వికసించడం ప్రారంభించాక శంకర్రావు అనుమానగుణంతో ఏం సుఖపడతాడా అని జాలిపడేవాణ్ణి.

నా చదువైపోయింది. నేను సెంట్రల్‌బ్యాంకులో గుమాస్తాగా చేరాను. నాకు పెళ్ళిసంబంధాలు వస్తున్నాయి. అయితే ఆఫీసరుగా ప్రమోషన్ వచ్చేవరకూ పెళ్ళిచేసుకోరాదని నేను నిశ్చయించుకున్నాను.

ఈలోగా ఆ వూళ్ళోనే స్టేట్‌బ్యాంక్‌లో ప్రొబేషనరీ ఆఫీసరుగా వచ్చాడు శంకర్రావు మిత్రుడి అదృష్టానికి నేను రవంత అసూయపడ్డమాట నిజం. కానీ మేమిద్దరం ఒకే ఊళ్ళో కలసి ఉంటామన్న సంతోషం ఆ అసూయను మించినది. రిటెన్‌టెస్టులో శంకర్రావు అఖిడుడు. అసలు అయ్యేయస్ సెలక్షన్ ఎందుకు రాలేదో అనుకున్నాను మొదటిసారి కలుసుకున్నప్పుడే ఆ ప్రశ్న అడిగాను

శంకర్రావు ఏమీ మారలేదు - "నేను బ్యాంకుటెస్టులో నెగ్గానని తెలిసినవాళ్ళంతా ఆ విషయం మెచ్చుకోకుండా ఈ ప్రశ్నే వేస్తున్నారు"- అన్నాడు.

తనను చిన్నబుచ్చడానికే ఈప్రశ్నవేసినట్లు శంకర్రావు భావించాడు చిన్నప్పట్నించీ తెలిసుండీ అతడినలాంటి ప్రశ్న వేయడం తప్పేమరి. అసలే అతడంటే నాకు జాలి వెంటనే తప్పు క్షమించమని అడిగేను. అతడినలా అడిగేది నేనొక్కడినే! శంకర్రావు చాలా సంతోషించాడు.

శంకర్రావుకు పెళ్ళి సంబంధాలు ముమ్మరంగా వస్తున్నాయి. నేను శంకర్రావు స్నేహితుడినని తెలిసేక ఒకరిద్దరు నావద్దకు వచ్చారు, తమ కేసులు రికమెండ్ చేసిపెట్టమని నా ద్వారా శంకర్రావు కు రెండు సంబంధాలు వచ్చాయి

ఓ అమ్మాయి రంభలా ఉంటుంది. చదువుకుంది. కట్నం అయిదు వేలకు మించి ఇచ్చుకోలేరు. పెళ్ళికూడా ఆర్భాటంగా చేయ లేరు. గుళ్ళో పెళ్ళి !

శంకర్రావుకు పిల్లనచ్చింది. అయితే పెళ్ళివారి ఆర్థిక పరి స్థితి దీన దశలో లేదని అతడికి అనిపించింది. వాళ్ళు తన్నులోకువ చేశారనీ, పిల్లనుచూసి ఒప్పేసుకుంటాననుకుంటున్నారనీ అన్నాడు కట్నం పదిహేను వేలకు తగ్గదన్నాడు. పెళ్ళి ఆర్భాటంగా జరగా లన్నాడు. తలిదండ్రుల సంగతి ఎలా ఉన్నా అతడే ఈ విషయమై మంకుపట్టు పట్టాడు

అప్పటికీ నేను చెప్పాను - పెళ్ళివారు అబద్ధాలు చెప్పడం లేదనీ - వారిశక్తి అంతకు మించదనీ !

"నువ్వు గుమస్తావు కాబట్టి నీకొచ్చే కట్నం రాదు. అందు కని నాకూ తక్కువ కట్నం వచ్చే సంబంధం చూడాలనుకుంటు న్నావు—" అనేశాడు శంకర్రావు.

మరెవరైనా అమాట అంటే బాధపడేవాణ్ణే ! శంకర్రావు గురించి నాకు చిన్నతనంనుంచీ తెలుసు కాబట్టి సారిపెట్టుకున్నాను. అతడికి నామీద కలిగిన అనుమానం పోగొట్టు కొనడం కోసమే రెండో సంబంధం శంకర్రావుకు తీసుకుని వచ్చాను.

ఈసారి కట్నం పాతిక వేలు పెళ్ళి ఆర్భాటంగా చేస్తారు. పిల్లకూడా బాగుంది ఈసారి ఏవిధంగానూ వంక పెట్టడానికి లేదు.

కానీ శంకర్రావు శంకర్రావే !

"పిల్ల బాగున్నప్పటికీ పాతికవేలు కట్నం ఇస్తున్నారంటే - ఆ పిల్లలో ఏదో లోపముండి ఉండాలి బహుశా ఆ అమ్మాయి గుణం మంచిదయుండదు—" అనేశాడతను

నేను దెబ్బతిన్నాను. కట్నం తక్కువిస్తే తనను లోకువ కట్టారంటాడు. ఎక్కువిస్తే పిల్లగుణం మంచిది కాదంటాడు.

నేను శంకర్రావు ఆలోచనా విధానాన్ని మెచ్చుకున్నాను అందువల్ల ఓ ఆడపిల్లకో మంచి సంబంధం పోగొట్టి ఉండవచ్చు కానీ ఇలాంటి అనుమాన గుణం గల భర్తతో ఆ పిల్ల మాత్రం ఏం సుఖపడుతుంది ?

ఆ తర్వాత నుంచి నేనింక శంకర్రావుకు పెళ్ళి సంబంధాల గురించి ప్రయత్నించలేదు

ఓ రోజు శంకర్రావే అడిగాడు - "నాకింక సంబంధాలు రావడం మానేశాయా ?"

"నేనే చూడ్డం లేదు "

"ఎందుకని ?"

"నీ కెలాంటి పిల్లకావాలో నాకేం తెలుస్తుంది ?" అన్నాను.

"మా నాన్నగారుకూడా ఇలాగే అన్నారు " అన్నాడు శంకర్రావు

నేను నవ్వి ఊరుకున్నాను.

"పిల్ల చదువుకుని ఉండాలి. ఎందుకంటే చదువుకోనివాళ్ళకు సంస్కారముండదు. మొగుణ్ణి నానా అల్లరీ పెడతారు అలాగని పిల్ల మరీ ఎక్కువ చదువుకుందుకు వీల్లేదు. అప్పుడాపిల్ల ఆధునిక భావాలను మనం జీర్ణించుకోలేం. స్త్రీ పురుషులు సమానహక్కులు అంటూ ఉపన్యాసం ప్రారంభించి మన జీవితాలను నరకం చేస్తారు. సంస్కారవంతుడైన మగవాడు భార్యను బాగానేచూసుకుంటాడు. అయితే ఆడది మాత్రం అతడికి అణగి మణగి ఉండాలి—" అన్నాడు శంకర్రావు.

"ప్రతి విషయాన్నీ నువ్వు చాలా బాగా ఆలోచిస్తావు " అన్నాను. అతడి ఆలోచనా విధానం నాకేమీ నచ్చకపోయినా అలా అనడం నాకు అలవాటు అయిపోయింది.

శంకర్రావు ముఖంలో వెలుగు కనిపించింది— "ఉద్యోగం చేసే ఆడపిల్లని చేసుకోకూడదు ఆమెకు మగవాళ్ళతో మసలడం అలవాటయుంటుంది. ఆమె శీలాన్ని నమ్మడం కష్టం "

నేను నవ్వి - "సంస్కారవంతుడైన మగవాడు పెళ్ళికి ముందు భార్య శీలం గురించి ఆలోచించ కూడదేమో!" అన్నాను

శంకర్రావు తిరగబడతాడనుకున్నాను. కానీ అతడు నన్నా శ్చర్యపరుస్తూ విపరీతంగా మెచ్చుకుని - "చాలా బాగా చెప్పావు. ఇంట్లో ఉంటూ పొరపాటున తప్పుచేసిన ఆడదాన్ని మన్నించవచ్చు. కానీ ఉద్యోగం చేస్తూ తప్పుచేసిన ఆడదాన్ని మన్నించకూడదు. ఎందుకంటే ఆమె మగవాళ్ళ సాహచర్యానికి అలవాటుపడడం వల్ల పెళ్ళయ్యాకకూడా తప్పులు చేస్తూనే ఉంటుంది "అన్నాడు.

శంకర్రావులో మరీ యింతగా అనుమాన గుణం పెట్టి నందుకు భగవంతుణ్ణి నిందించానారోజు అయితే సరిగ్గా రెండు నెలల తర్వాత శంకర్రావులో అనుమాన గుణం పెట్టినందుకే భగ వంతుణ్ణి అభినందించాను

తనకు పెళ్ళయ్యే అవకాశం లేదని నిరాశ చెందిన సీతను శంకర్రావు కట్నం లేకుండా పెళ్ళి చేసుకున్నాడు.

అతిదెలాంటి అమ్మాయిని చేసుకుంటాడా అని కుతూహల పడుతున్ననాకు- ఆరోజునుంచీ సీతపైన జాలిపడవలసిన అవసరం తొలగి పోవడమేకాక- శంకర్రావు అనుమానగుణంపైన అభిమానం కూడా బయల్దేరింది

■■■★■■■